క్లుప్తంగా

'ఎన్‌పీసీఐ లింక్'కు స్పెషల్ డ్రైవ్

గుంతకల్లుటౌన్: ఎన్‌పీసీఐ విధానం ద్వారా బ్యాంకు ఖాతాతో ఆధార్ నెంబర్‌ను లింక్ చేసుకోవడానికి గుంతకల్లు సబ్ డివిజన్‌లోని అన్ని పోస్టాఫీసుల్లో ఈ నెల 31 నుంచి జూన్ 4 వరకూ స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు అసిస్టెంట్ పోస్టల్ సూపరింటెండెంట్ ఎం.విజయ భాస్కర్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ పథకాల నగదు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి జమ కావాలంటే ఆధార్ అనుసంధానం తప్పనిసరన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంక్ అకౌంట్‌ను ఆధార్ అనుసంధానంతో ఓపెన్ చేయవచ్చన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఘనంగా మన్యుసూక్త హోమం



హోమం నిర్వహిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో మంగళవారం మన్యుసూక్త హోమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ఆలయ యాగశాలలో ఆంజనేయస్వామి ఉత్సవ మూర్తిని కొలువుదీర్చి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య మన్యుసూక్త హోమం నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

తాడిపత్రిలో 6.4 మి.మీ. వర్షపాతం

తాడిపత్రి: తాడిపత్రి నియోజకవర్గ వ్యాప్తంగా నైరుతి రుతు పవనాల రాకతో రెండు రోజులుగా చిరు జల్లులు కురుస్తున్నాయి. సోమవారం కురిసిన వర్షపాతం వివరాలు నియోజకవర్గవ్యాప్తంగా ఇలా ఉన్నాయి. తాడిపత్రి మండలంలో 6.4 మిల్లీమీటర్లు, పెద్దపప్పూరులో 4.2 మి.మీ., యాడికి మండలంలో 19.0 మి.మీ., పెద్దవడుగూరు మండలంలో 7.8 మిల్లీమీటర్లుగా నమోదైంది. ఈ ఏడాది ముందుగా వర్షాలు కురవడంపై అన్నదాతలు హర్షం వ్యక్తం చేశారు.

ద్విచక్ర వాహనాలకు వేలం



పోలీసు స్టేషన్‌లో వేలం నిర్వహిస్తున్న దృశ్యం

గుత్తి: పట్టణంలోని పోలీసు స్టేషన్‌లో సీఐ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ సురేష్ ఆధ్వర్యంలో మంగళవారం వివిధ కేసుల్లో పట్టుబడిన 17 ద్విచక్ర వాహనాలకు వేలం నిర్వహించారు. వాహనాలను ఇస్మాయిల్ అనే వ్యక్తి జీఎస్టీతో కలిపి రూ.1,06,790లకు దక్కించుకున్నాడు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుళ్లు హనుమంతు, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు సుభిక్షంగా ఉండాలి



మార్కండేయ స్వామికి పూజలు చేస్తున్న దృశ్యం

యాడికి: మండల కేంద్రంలోని మార్కండేయ స్వామి దేవాలయంలో భద్రావతి భావనారాయణ రుషి స్వామి వారికి వైశాఖ అమావాస్యను పురస్కరించుకుని ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మార్కండేయ స్వామి దేవాలయ కమిటీ అధ్యక్షుడు జానపాటి గురుమూర్తి స్వామి, బీజేపీ మండల అధ్యక్షుడు రాజశేఖర్ మాట్లాడుతూ వర్షాలు బాగా కురిసి రైతులు పాడి పంటలతో సుభిక్షంగా ఉండాలని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, ఫణిబాబు, నాగరంగయ్య, జయప్రసాద్, చిట్టి, మురళికుమార్, చిన్నమయ్య, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా వ్యవహరించాలి



పోస్టర్లను విడుదల చేస్తున్న దృశ్యం

గుంతకల్లు: సైబర్, ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా వ్యవహరించాలని డీసీపీయూ ప్రొటెక్షన్ ఆఫీసర్ ఎం.వెంకట్వేరి సూచించారు. కిశోరి వికాసం శిక్షణా తరగతుల్లో భాగంగా మంగళవారం పట్టణంలోని ఆంథోని స్ట్రీట్, మోదీనాబాద్‌లో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సైబర్, ఆన్‌లైన్ మోసాలు, భద్రత తదితర సమస్యలను ఎదుర్కోవడంపై అవగాహన కల్పించారు. అనంతరం బాల్యవివాహాల కలిగే అనర్థాలపై వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు శ్రీదేవి, పుష్పావతి, మహిళా పోలీసులు హిమబిందు, నాగమణి, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్‌ల పాలనలో సమస్యల తిష్ట

యల్లనూరు మండలంలో ఇన్‌చార్జ్ అధికారులే దిక్కు కావడంతో పాలన కుంటుపడింది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి కీలక శాఖలకు రెగ్యులర్ ఉద్యోగులు లేకపోవడంతో రస్తా సమస్యలు, భూముల ఆన్‌లైన్, రీ సర్వే సమస్యలు పేరుకుపోయాయి. తహసీల్దార్ కార్యాలయంలో రెగ్యులర్ తహసీల్దారు, డిప్యూటీ తహసీల్దారు, జూనియర్, సీనియర్ అసిస్టెంట్ లేక పోవడంతో ఇన్‌చార్జ్‌ల పాలన నేపథ్యంలో పర్యవేక్షణ లేకపోవడంతో సేవలందక ప్రజలు అవస్థలు పడుతున్నారు.

- రెగ్యులర్ తహసీల్దార్ లేక రైతులు, ప్రజల అవస్థలు
- సరిహద్దులు దాటుతున్న రేషన్ బియ్యం
- పట్టించుకోని పాలకులు, అధికారులు



యల్లనూరులోని తహసీల్దార్ కార్యాలయం



ఖాళీగా ఉన్న తహసీల్దార్ కుర్చీ

యల్లనూరు: మండలంలో రెగ్యులర్ తహసీల్దార్ లేక రైతులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పుట్లూరు తహసీల్దారు శేషారెడ్డికి యల్లనూరు బాధ్యతలను అప్పగించారు. రెండు మండలాల భారం అధికమై ఆయన తల పట్టుకుంటున్నారు. అలాగే పనులు జరుగక మండలవాసులు సతమతమౌతున్నారు. పుట్లూరు రెగ్యులర్ కావడంతో తహసీల్దార్ శేషారెడ్డి వారంలో రెండు రోజులు మాత్రమే యల్లనూరులో అందుబాటులో ఉంటున్నారు. రస్తా సమస్యలు, భూముల ఆన్‌లైన్, రీ సర్వే సమస్యలు అధికంగా ఉన్నాయి. రైతు సమస్యలను పరిష్కరించడంలో రెవెన్యూ యంత్రాంగం విఫలమవుతోంది. అలాగే చాలా పల్లెల్లో చౌక డిపో సమస్యలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక డీలర్లపై కక్ష సాధింపులు మొదలయ్యాయి. కొందరు డీలర్లు ఇదే అదునుగా భావించి పేదల బియ్యం పక్కదారి పట్టిస్తున్నారు. ఇదేమని ప్రశ్నించే వారు లేరు. ఇటు రెవెన్యూ.. అటు పోలీసులు రేషన్ బియ్యం పట్టుకున్న పాపాన పోలేదు. డీలర్ల నుంచి ప్రతి నెలా మామూళ్లు తీసుకుంటుకున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి.

పైసలు ఇవ్వనిదే ఫైలు కదలదు..

వీఆర్‌ఓలు ప్రతి పనికి ఒక రేటు పెట్టుకున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. పైసలు ఇవ్వనిదే ఫైలు కదలడం లేదన్నారు. వీఆర్వోల సంతకాలకు మరీ డిమాండ్. సర్వే పనులు చేయాలంటే చేతులు తడపాల్సిందే. రెగ్యులర్ అధికారులు లేక వారు ఆడిందే ఆట పాడిందే పాటగా మారింది. సమస్యలను బట్టి వీఆర్వోలు, సర్వేయర్లు డబ్బులు గుంజుతున్నారని తెలుస్తోంది. యల్లనూరు మండలంలో 19 రెవెన్యూ గ్రామాలు ఉండగా 14 సచివాలయాలకు మాత్రమే వీఆర్వోలు ఉన్నారు.

కార్యాలయంలో ఖాళీలు ఇలా..

తహసీల్దార్ కార్యాలయంలో రెగ్యులర్ తహసీల్దారు, డిప్యూటీ తహసీల్దారు, జూనియర్, సీనియర్ అసిస్టెంట్ పోస్టులకు ఇన్‌చార్జ్ అధికారులే దిక్కుగా మారారు. అలాగే ఎంపీడీఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్, ఏపీఓ పోస్టులు ఖాళీ ఉన్నాయి. ఇక మల్లాగుండ్ల, నిట్టూరు సచివాలయాలకు వీఆర్వోలు లేరు. నిట్టూరు వీఆర్వో శ్రీనివాసులు తాడిపతికి బదిలీ అయ్యారు. వీరి స్థానంలో ఇంకా ఎవ్వరిని నియమించలేదు. మల్లాగుండ్ల వీఆర్వో షభానా మెటర్నటీ లీవ్‌లో ఉన్నారు. ప్రస్తుతం బొప్పేపల్లి వీఆర్వో రవికి మల్లాగుండ్ల బాధ్యతలు అప్పగించారు. కల్లూరు వీఆర్వో మన్మథరెడ్డికి బొప్పేపల్లి బాధ్యతలను అప్పగించారు. సిబ్బంది లేకపోవడంతో మండలంలో రెవెన్యూ సమస్యలు పేరుకుపోతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి మండలానికి రెగ్యులర్ అధికారులను నియమించి సమస్యలు పరిష్కారమయ్యేలా చూడాలని రైతులు, ప్రజలు, విద్యార్థులు కోరుతున్నారు. ఈ విషయమై ఆర్డీఓ కేశవనాయుడును సాక్షి వివరణ కోరగా ఖాళీల వివరాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. త్వరలో రెగ్యులర్ అధికారులను నియమిస్తామని హామీ ఇచ్చారన్నారు.

భూ సమస్య పరిష్కరించండి



నాకు 4.78 ఎకరాలకు పట్టాదారు పాసు పుస్తకం ఉంది. కొందరు టీడీపీ నాయకులు దౌర్జన్యంగా ఆ భూమికి నకిలీ పట్టాలు సృష్టించి సాగు చేసుకుంటున్నారు. ఆర్డీఓ, తహసీల్దారు వద్దకు తిరుగుతున్నా పట్టించుకోకుండా పచ్చ నాయకులకే వంత పాడుతున్నారు. పలుమార్లు కలెక్టరు వినోద్‌కుమార్‌కు అర్జీల రూపంలో ఇచ్చినా ఫలితం లేదు. రెగ్యులర్ తహసీల్దార్ లేక సమస్య పరిష్కారం కావడం లేదు..

– నామాల శ్రీరాములు, రైతు, శింగవరం

సమస్యల పరిష్కారానికే 'ల్యాండ్ దర్బార్'

పెద్దపప్పూరు: దీర్ఘకాలిక రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసమే పోలీసు, రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ల్యాండ్ దర్బార్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తాడిపత్రి ఏఎస్పీ రోహిత్‌కుమార్ చౌదరి, తహసీల్దార్ బాలాజీ రాజు, ఎస్‌ఐ నాగేంద్ర ప్రసాద్ అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన ల్యాండ్ దర్బార్ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ చిన్నపాటి భూ సమస్యల కోసం రెవెన్యూ అధికారులను ఆశ్రయిస్తే పరిష్కరిస్తారన్నారు. అలాకాకుండా ఘర్షణలకు దిగితే పోలీసు కేసుల్లో ఇరుక్కోవలసి వస్తుందన్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని శ్రీకృష్ణస్వామి ఆలయ స్థలంలో వ్యాపార దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారని, పాత సుంకులమ్మ ఆలయం వద్ద ఓ వ్యక్తి మూడు సెంట్ల విస్తీర్ణానికి చౌడేశ్వరిదేవి పురిమాను కట్ట వద్ద కొంత స్థలానికి డీ పట్టాలు పొందారని వాటిని తొలగించాలని పలుమార్లు అధికారులకు విన్నవించినట్లు ఎమ్మార్పీస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఆదినారాయణ, సీపీఐ మండల కార్యదర్శి చింతా పురుషోత్తం అధికారులకు వినతి పత్రం అందజేశారు. విచారించి తగుచర్యలు చేపడతామని అధికారులు హామీ ఇచ్చారు. కాగా పలు గ్రామాల ప్రజలు భూ సమస్యలపై అధికారులకు 32 వినతిపత్రాలందజేశారు. కార్యక్రమంలో రెవెన్యూ, పోలీస్‌శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



అక్రమణలను అరికట్టాలని ఏఎస్పీకి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

గుంతకల్లు: స్థానిక రైల్వేస్టేషన్‌లో సైడ్‌వాల్ పెచ్చులూడి పడి బాలుడు మణికంఠ మృతికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డి.జగదీష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం డీఆర్‌ఎం చంద్రశేఖర్‌గుప్తాకు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా ఆ రైల్వే కాంట్రాక్టర్‌ను బ్లాక్ లిస్టులో పెట్టడంతోపాటు సంబంధిత అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలన్నారు. అలాగే బాలుడి కుటుంబానికి రూ.50 లక్షలు పరిహారం చెల్లించడంతోపాటు వారి ఇంట్లో ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే రైల్వేస్టేషన్‌లో ఉన్న దుకాణాల్లోని తినబండారాల్లో నాణ్యత లోపించాయన్నారు. అంతేకాకుండా లోకల్ వాటర్ బాటిల్స్ విక్రయిస్తూ ప్రయాణికులను దోచుకుంటున్నారని ఆరోపించారు. వీటిపై అధికారులు దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు బి.గోవింద్, వీరభద్రస్వామి, మహేష్, గోపీనాథ్, రామురాయల్, ఎస్ఎండీ గౌస్ తదితరులు పాల్గొన్నారు.



డీఆర్‌ఎంకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

సీఐలను సస్పెండ్ చేయాలి

గుత్తి: తెనాలిలో దళిత, మైనార్టీ యువకులను విచక్షణారహితంగా కొట్టిన సీఐలను వెంటనే సస్పెండ్ చేయాలని బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి గద్దల నాగభూషణం డిమాండ్ చేశారు. గుత్తిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద మంగళవారం బీఎస్పీ నాయకులు, కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చాక దళిత, గిరిజన, మైనార్టీ, బీసీ వర్గాలకు రక్షణ లేకుండా పోతోందన్నారు. యువకులను ఇష్టానుసారం కొట్టిన సీఐలను ప్రభుత్వం వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. సీఐలను సస్పెండ్ చేయకపోతే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఎస్పీ నియోజకవర్గం కన్వీనర్ వెంకట కొండయ్య, అధ్యక్షుడు విజయ్, సీనియర్ నాయకులు బండల రామాంజనేయులు, సుధాకర్, అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

గార్లదిన్నె: గుంటూరు జిల్లా తెనాలి మూడవ పట్టణ పోలీస్ స్టేషన్‌లో దళిత యువకుల్ని కొట్టిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని అనంతపురం డివిజన్ ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ మానటరింగ్ కమిటీ సభ్యులు లోలూరు కుళ్లాయప్ప డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ తెనాలి మూడవ పట్టణ సీఐ,ఎస్ఐలు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసేలా బహిరంగంగా ప్రజలు చూస్తుండగానే నడి రోడ్డుపై విచక్షణ కోల్పోయి వీధి రౌడీలను తలపించేలా చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని దళిత, మైనార్టీ యువకులను బూటు కాలితో తన్నడం దారుణమన్నారు.



గుత్తిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న బీఎస్పీ నాయకులు

పెట్రోల్ బంకుల్లో మోసాలపై దృష్టి సారించండి

గుంతకల్లు: పెట్రోల్ బంకుల్లో జరుగుతున్న అవకతవకలపై దృష్టి సారించాలని సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రాసీ గుంతకల్లు డివిజన్ కమిటీ కార్యదర్శి బి.సురేష్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆర్‌డీఓ కార్యాలయంలోని ఏఓ నాగభూషణంకు ఆయన వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలోని పెట్రోల్ బంకులో లీటర్ పెట్రోల్ ద్విచక్ర వాహనాల్లో వేస్తే అందులో 9 పాయింట్లు మాత్రమే వేస్తున్నారు. 10 లీటర్లకు ఒక లీటర్ పెట్రోల్ చొప్పున కాజేస్తూ ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. ఈ విషయమై వాహనాదారులు ప్రశ్నిస్తే సిబ్బంది ఘర్షణకు దిగాతున్నారన్నారు. పెట్రోల్ బంకు యజమానులు అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నా తూనికలు, కొలతలు, పౌరసరఫరాల అధికారులు ఏం చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. అధికారులు తనిఖీ చేసి పెట్రోల్ బంకుల్లో అవకతవకలకు అడ్డుకట్ట వేయాలని కోరారు.



ఏఓకు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



గుంతకల్లులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యోగాసనాలు వేస్తున్న అధ్యాపకులు



గార్లదిన్నె ఎంపీడీఓ కార్యాలయంలో యోగాపై శిక్షణ పొందుతున్న సిబ్బంది

గుంతకల్లుటౌన్/శింగనమల/గార్లదిన్నె/పెద్దవడుగూరు: సంపూర్ణ ఆరోగ్యం యోగాతోనే సాధ్యమని మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్ సూచించారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా మంగళవారం మున్సిపల్ అధికారులు, సిబ్బంది అవగాహనా ర్యాలీ నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ యోగా, ధ్యానం సాధన చేయడం ద్వారా మానసిక, శారీరక రుగ్మతలను దూరం చేయవచ్చన్నారు. అలాగే స్థానిక ఎస్‌కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


- శింగనమల మండలంలోని తరిమెల గ్రామంలో యోగాంధ్ర కార్యక్రమంపై వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. వచ్చే నెల 21న నిర్వహించే యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తరిమెల పీహెచ్‌సీ వైద్యుడు శంకర్ నాయక్ సూచించారు. మంగళవారం
- గార్లదిన్నె ఎంపీడీఓ కార్యాలయంలో యోగాపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ యోగానందరెడ్డి , సిబ్బంది పాల్గొన్నారు.
- పెద్దవడుగూరులోని ఓ ఫంక్షన్ హాల్‌లో బుధవారం యోగా దినోత్సవం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బారెన్‌సాహెబ్ తెలిపారు. ఉదయం 7 గంటల లోపు మండల స్థాయి అధికారులు, సిబ్బంది, ప్రజలు హాజరు కావాలని సూచించారు.

నేటి నుంచి యోగాపై శిక్షణ


పామిడి: పామిడిలోని సరస్వతీ ఉన్నత విద్యామందిరంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం నుంచి వచ్చే నెల 3 వరకూ, గ్రామీణ ప్రాంతాల యువతకు వచ్చే నెల 4 నుంచి 16వ తేదీ వరకూ యోగాపై మండలస్థాయి శిక్షణా కార్యక్రమాలు ఉంటాయని స్థానిక ఆయుష్ వైద్యాధికారి జీ కృష్ణవేణి మంగళవారం తెలిపారు. తనతోపాటు ఎంపీడీఓ కే తేజోత్స్న, తహసీల్దార్ ఎన్ శ్రీధరమూర్తి ఆధ్వర్యంలో యోగా ఫ్యాకల్టీలు సంధ్యాదత్త్, రేవతి శిక్షణ ఇస్తారన్నారు.

యోగా నిర్వహించే ప్రాంతాన్ని పరిశీలించిన ఆర్డీఓ


గుత్తి: పట్టణంలోని కోటపై జూన్ 2న కలెక్టర్ ఆధ్వర్యంలో జరిగే యోగాంధ్ర కార్యక్రమం ప్రాంతాన్ని మంగళవారం గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాస్ పరిశీలించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో ఆయా శాఖల అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. యోగాంధ్ర రిజిస్ట్రేషన్లపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జబ్బార్‌మియా, తహసీల్దార్ ఓబులేసు, ఎంఈఓ రవి నాయక్, గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు విజయ భాస్కర్, గైడ్ రమేష్, రిటైర్డ్ ఆర్మీ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.



గుంతకల్లులో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్



శింగనమల మండలం తరిమెలలో ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది



గుత్తి కోటలో యోగా జరిగే ప్రాంతాన్ని అధికారులతో కలసి పరిశీలిస్తున్న ఆర్డీఓ శ్రీనివాస్

వైభవంగా శనీశ్వరుడి జయంతి



అలంకరణలో శనీశ్వరుడు

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని తాడిపత్రి రహదారి పక్కన శనీశ్వరుడి ఆలయంలో మంగళవారం శనీశ్వరుడి జయంతి సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే ఆలయంలో మూలవిరాట్‌ను ప్రధాన అర్చకుడు బాబాస్వామి ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు కుంకుమాభిషేకం, అర్చనలు చేశారు. ఆలయంలో గణపతి పూజ, నవగ్రహ పూజ, స్వస్తి పుణ్యావాచనం హోమాలు నిర్వహించారు. అదే విధంగా భక్తులు స్వామి వారికి తైలాభిషేకం పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఖైదీలకు ఉచితంగా న్యాయ సేవలందిస్తాం



మాట్లాడుతున్న జడ్జి రాజశేఖర్

బుక్కరాయసముద్రం: అనంతపురం జిల్లా జైల్లో ఉన్న రిమాండ్ ఖైదీలకు ఉచితంగా న్యాయ సేవలు అందించేందుకు కృషి చేస్తామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి రాజశేఖర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా జైలును ఆయన తనిఖీ చేశారు. ముందుగా జైల్లో ఖైదీల బ్యారెక్‌లను పరిశీలించారు. వంట గదులను తనిఖీ చేసి ఆహార పదార్థాలను పరిశీలించారు. ఖైదీల కోసం తయారు చేసిన ఆహారాన్ని ఆయన రుచి చూశారు. ఖైదీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఖైదీలకు అందుతున్న వైద్య సదుపాయాలు, మౌలిక వసతులపై ఆరా తీశారు. జైలు వాతావరణాన్ని పరిశీలించారు. ఖైదీలకు ఉచితంగా న్యాయ సేవలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా జైలు సూపరింటెండెంట్ రహ్మాన్ జైలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి సువార్త సభలు

పామిడి: పట్టణంలోని హనుమాన్ లింకురోడ్డు బైపాస్ సర్కిల్‌లో బుధవారం నుంచి ఈ నెల 30వ తేదీ వరకూ కల్వరి ఏజీ చర్చి ఆధ్వర్యంలో క్రీస్తు రక్షణ సువార్త సభలు నిర్వహించనున్నట్లు పాస్టర్ ప్రేమానందం మంగళవారం తెలిపారు. ఈ సభలకు ముఖ్య ప్రసంగీకులుగా రెవరెండ్ ఎం.తిమోతి (అనంతపురం), పాస్టర్ అబ్రహాం (మంగళగిరి), పాస్టర్ ఎండీ ఇష్మాయేలు (ఏర్లపాడు) విచ్చేస్తారన్నారు. రోజూ సాయంత్రం 6.30 గంటలకు సభలు ప్రారంభమవుతాయన్నారు. సువార్త సభల్లో మండల, మండలేతర క్రైస్తవ విశ్వాసులు పాల్గొనాలని ఆయన కోరారు.

31న జబర్దస్త్ టీం రాక

యల్లనూరు: మండలంలోని తిమ్మంపల్లికి ఈ నెల 31న జబర్దస్త్ టీం రానున్నట్లు ఆ ప్రోగ్రాం అధికారి వినోద్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తిమ్మంపల్లిలో నూతనంగా నిర్మించిన వేంకటేశ్వరస్వామి దేవస్థానం ప్రారంభోత్సవం సందర్భంగా నిర్వహించే కార్యక్రమానికి వినోద్ రానున్నారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలుంటాయన్నారు.

ఆధార్ అప్డేట్ కోసం అవస్థలు



సచివాలయంలో వేచి ఉన్న ప్రజలు

గుత్తి: మున్సిపాలిటీ పరిధిలో ఆధార్ అప్డేట్, రేషన్ కార్డుల దరఖాస్తుల కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సచివాలయాలకు వెళ్లి పడిగాపులు కాస్తున్నారు. సర్వర్లు సరిగా పని చేయకపోవడం, సచివాలయ సిబ్బంది ఆలస్యంగా రావడం వంటి కారణాలతో చిన్న పిల్లలు, మహిళలు, వృద్ధులు అవస్థలు పడుతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి ఆధార్ అప్డేట్ కేంద్రాల సంఖ్యను పెంచాలని ప్రజలు కోరుతున్నారు.

నేడు పౌరాణిక నాటక ప్రదర్శన

పామిడి: పట్టణంలోని పంచాయతీ కార్యాలయ ఆవరణలో బుధవారం రాత్రి స్థానిక స్వరరాగ నాటక కళాసమితి ఆధ్వర్యంలో పంచరత్నాలు అను పౌరాణి నాటకం ఉచితంగా ప్రదర్శించనున్నట్లు ఆ సమితి వ్యవస్థాపకులు ఎం దేవరాజు, పుంజా కృష్ణారావు యాదవ్ మంగళవారం తెలిపారు. ఏపీ రాష్ట్ర సృజనాత్మక, భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో నిరుపేద కళాకారుల సహాయార్థం నాటకం ప్రదర్శిస్తున్నామన్నారు. నాటక ప్రియులు పెద్దఎత్తున హాజరై జయప్రదం చేయాలని వారు కోరారు.

సెన్సార్ వీధి దీపాల ఏర్పాటు

పెద్దవడుగూరు: పెద్దవడుగూరు గ్రామ పంచాయతీలో రెండు రోజులుగా సర్పంచ్ వరలక్ష్మి ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి లక్ష్మీనారాయణ వీధి దీపాలను ఏర్పాటు చేస్తున్నారు. గ్రామంలో ప్రధాన రహదారి వెంట రాత్రి సమయాల్లో చీకటి ఉన్న ప్రాంతాలను గుర్తించి సెన్సార్ వీధి దీపాలను ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. ఈ దీపాలు ఆటోమెటిక్‌గా ఉదయం 6 గంటలకు బంద్ అయి సాయంత్రం 6 గంటలు అవగానే ఆన్ అవుతాయన్నారు.

మా ప్రభుత్వంలో మీ పెత్తనమా?

- వైఎస్సార్‌సీపీ నాయకుడిపై టీడీపీ నేతల దౌర్జన్యం

తాడిపత్రిటౌన్: మా ప్రభుత్వంలో మీ పెత్తనం ఏందంటూ వర్షం కోసం పూజలు తలపెట్టిన వైఎస్సార్‌సీపీ నాయకుడిపై టీడీపీ నాయకులు దౌర్జన్యానికి దిగిన సంఘటన తాడిపత్రి మండలం ఆలూరులో చోటు చేసుకుంది. వివరాలు.. తాడిపత్రి మండలం ఆలూరు గ్రామంలో ఏటా వర్షం కోసం కాటమయ్య స్వామికి గ్రామస్తులు పూజలు నిర్వహించడం ఆనవాయితీ. ఈక్రమంలో మంగళవారం వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆలూరు రాజగోపాల్‌రెడ్డి వర్షం కోసం కాటమయ్యస్వామికి పూజలు నిర్వహిస్తున్నామని గ్రామంలో టంకా వేయించాడు. అయితే ఇది నచ్చని అదే గ్రామానికి చెందిన కొంత మంది టీడీపీ నాయకులు టంకాను అడ్డగించడంతోపాటు మా ప్రభుత్వంలో నీ పెత్తనం ఏదంటూ వాగ్వాదానికి దిగారు. విషయం తెలుసుకున్న తాడిపత్రి రూరల్ సీఐ శివగంగాదర్‌రెడ్డి గ్రామానికి చేరుకుని వైఎస్సార్‌సీపీ నాయకుడు రాజగోపాల్‌ను స్టేషన్‌కు తీసుకువచ్చి గ్రామంలో గొడవలు సృష్టించవద్దని చెబుతూనే సాయంత్రం వరకూ స్టేషన్‌లో ఉంచుకుని పంపించారు. వర్షం కోసం చేసే పూజలను కూడా టీడీపీ నాయకులు పోలీసులతో అడ్డుకోవడంపై గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.